‘ఏం(టోయ్! అలాగ షేక్స్పియర్‌లాగా మొహం పెట్టుకుని కూర్చున్నావ్?’ అని, సీట్లో గంభీరంగా విషాదంగా కూర్చుని వున్న సుబ్బారావుని ప్రశ్నించాడు అడ్డ. కన్ను మన్నాడు సుబ్బారావ్, వురఫ్ ఎలుగ్గొడ్డు.

‘ఏం(టోయ్! ఫ్రండువిగదా! అలాగున్నా వేమని పలకరిస్తే మీదపడి కరుస్తున్నావ్?! ఆ కళ్ళు అలా ఎ(రగా వున్నాయేంటి?’ అని అడ్డ అనగా— మి (రి మి (రి చూసాడు సుబ్బారావు. కళ్ళెర్రజేశాడు.

‘కాఫీకొస్తావేమోనని అడిగితే అలాగ ఎలుగ్గొడ్డులాగ మీదికి వురికేటట్టు చూస్తావేంరా?! వస్తావా కాఫీకి? వస్తేరా. లేకపోతే నీ ఖర్మ. అలాగే పడివుండు. ఏమిటీ కేసూ? గృహ కార్యకలాపాల నిర్వహణలో, డిపాజిట్టు గాని పోలేదు గదా! సర్లెయితే. మేంవస్తాం’ అని గలగల కబుర్లు చెప్పుకుంటూ అడ్డా, సోలా వెళ్ళిపోయారు. దిగులుగా కూర్చుండి పోయేడు సుబ్రావ్.


అడ్డ పేరు ఆనందరావు. ప్రతివిషయానికీ అడ్డదిడ్డమయిన ప్రశ్నలు వేసి కన్‌ఫ్యూజ్ చేస్తాడని ఆ ముద్దు పేరు. సోల పేరు సోమ శేఖరావు. ప్రతి చిన్న విషయానికీ కంగారు పడిపోయి సోల ఆయిపోతాడని ఆ నిక్‌నేమ్. బాగా కండలు పెంచి, ప్రతిదానికీ ఆలోచన అనేది లేక ముందుకి వు రు కు తా డ ని సుబ్బారావుకి ఎలుగ్గొడ్డని ఒక సూక్ష్మనామం పెట్టుకుంట !

సుబ్బారావుకి తి క్క తి క్క గా వుంది. ఆకలిగా వుంది. ఏ పనీ చేయాలనిపించదు. మనసుని కత్తి కఠారులతో నిర్దాక్షిణ్యంగా పొడిచినట్లుగావుంది. కళ్ళు మండుతున్నాయ్. బుర్ర వేడెక్కి మాగ్జిమం టెంపరేచరు అందుకుంది. వేడి, యమవేడి. ఉక్క, తిక్క కూడాను.

ఆ వుదయం ఏమయిందంటే—

సుబ్బారావుకి ఇద్దరు పిల్లలు. ఒకడు బండిచక్రమూ, రెండోది సైకిలూ. చక్రానికి ఆరేళ్ళు. సైకిలు వయస్సు నా లు గే ళ్ళు. సుబ్బారావు భార్య సుందరి. సుందరిని లవ్‌చేసి పెళ్ళి చేసుకున్నాడు సుబ్బారావు. ఇంట్లో సుందరిమాటే రూలు. అవునా—

ఆ తెల్లవారుఝామున నాలుగు గంటలకు నిద్రలేచి, కొన్ని అర్జంటు ఆఫీసు ఫైల్సు మీద పని చేసేసి, లేచి దొడ్లోకి వెళ్ళి కాల కృత్యాలు తీర్చుకుని ముందుగదిలోకి వచ్చాడు,



ఏడింటికి సుబ్బారావు. ఆ క్షణంలో కంట బడిన ఆ దృశ్యాన్ని చూసి సుబ్బారావు అగ్ని పర్వతంలాగా పేలిల్లుమని పొగలూ సెగలూ క్రక్కాడు! కో పం తో బుసలు గొట్టి బుషేశ్వర్ అయాడు.

అతను ఎంతో కష్టపడి నోట్సూ, డ్రాఫ్ట్సు తయారుచేసిన ఆ కాగితాలనిండా సిరా, ఘోరంగా వలకబోసి వుంది. అందుకు కారకురాలయిన సైకిలు చేతులనిండా, మొహంమీదా, గౌనుమీదా విరివిగా సిరా మరకలు వున్నాయి. ‘సుబ్బారావు పెన్ను’ని చేత్తో పట్టుకుని, బండిచక్రంగాడు ఆట కాయితనంగా బలంగా నేలకేసి గుద్దాడు. పెన్ను, పాళీ, నాళికా పచ్చడి పచ్చడి అయి వంకరలు తిరిగి పోయేయి. పెన్ను పగిలిపోయి ఏడ్చి సిరాచుక్కలు రాలుస్తున్నది.

సుబ్బారావు కోపం ఆపుకోలేకపోయేడు. కసిగా విజృంభించేడు, అరుస్తూ. ఆ ఇద్దరు కొంటె పిల్లల వీపులూ రాంధోం మోతలు మోగిపోయేయి. చంపలు ఛళ్ళుమన్నాయి. వాళ్ళ చెవులు సుబ్బారావు చేతుల్లో కఠిన శిక్షకి గురయ్యేయి. ఆ ఇద్దరు పిల్లలు గోల

మీ గృహాలంకరణకు
కావలసిన
ఫర్నిషింగ్స్, డోర్ కర్టెన్స్
బెడ్ షీట్స్, టవల్స్
కార్ సీట్ కవర్స్
ఆకర్షణీయమైన రంగులలో
అసంఖ్యాకమైన డిజైన్లలో
లభించును.

PHONE: 73708
డెకార్స
V.H.R. కాంప్లెక్స్
బీసెంట్ రోడ్
విజయవాడ-2.



కథ-స్క్రీన్‌ప్లే
దాసరి నారాయణరావు
దర్శకత్వం
దుర్గా నాగేశ్వరరావు
మణియన్ ఫిలింస్
సీతాలు
కలర్
నిర్మాతలు: మణియన్. విద్వాన్ లక్ష్మణన్



## శుభవార్త

తల నొప్పి, కడుపు నొప్పి, చర్మ వ్యాధులు, నరాల బలహీనత, శరీర అవయవములు సరియైన సైజులో ఉండకపోవుట, ఫిట్సు, స్త్రీల ముట్టు కుట్టు నొప్పి, సుఖ వ్యాధులు, మూత్ర వ్యాధులు చక్కెర వ్యాధి, మూలశంక, పిల్లలు లేకపోవుట, దాంపత్య సుఖ లోపం మొదలైన వ్యాధులను మా వైద్యశాల ప్రధాన వైద్యులు, డాక్టరు **ఎన్. ఎస్. రావు** గారు నాడీపరీక్షతో వైద్యము చేయుదురు.

పరీక్ష ఫీజు రూ. 15/-. వ్యాధిని బట్టి చికిత్సకు ఛార్జి చేయుదురు. మందులు వారే ఇస్తారు.

**N.B.** : పేదల వైద్యము నెలకు రూ. 15/- మాత్రమే.

2 మాసాల మందు ఒకేసారి తీసుకొనవచ్చును.

క్యాంపుల వివరం :— ఆగస్టు, అక్టోబరు, డిసెంబరు, ఫిబ్రవరి, ఏప్రిల్, జూన్.

గుంటూరు : 14వ తేదీ, ఉడిపి శ్రీకృష్ణభవన్, స్టేషన్‌రోడ్. ఏలూరు: 15వ తేదీ, వసంత మహల్‌లాడ్జి. రాజమండ్రి : 16, 17 తేదీలు, శాంతి నివాస్. కాకినాడ : 18వ తేదీ, ద్వారకా లాడ్జి. అనకాపల్లి : 19వ తేదీ, శ్రీనివాస లాడ్జి. వైజాగ్ : 20, 21 తేదీలు, బృందావన్ లాడ్జి, డాబా గార్డెన్స్. శ్రీకాకుళం : 22వ తేదీ, బృందావన్ లాడ్జి. విజయనగరం: 23వ తేదీ, అప్సర లాడ్జి. విజయవాడ: 24వ తేదీ, మాడరన్ కేఫ్, గాంధినగర్. ఖమ్మం : 25వ తేదీ, మయూర్ కేఫ్, (శేష్‌మహల్ లాడ్జి). వరంగల్: 26వ తేదీ, హోటల్ నటరాజ్. 27వ తేదీ నుండి హెడ్డాఫీసు.

సంప్రదించు కాలము : ఉ. 7 గంటల నుండి సా. 4 గంటల వరకు.

నిరుద్యోగులకు, ఉద్యోగులకు శుభవార్త. పై సెంటర్సులో స్త్రీలు, పురుషులు ఏజంట్సుగా పనిచేసి, నెలకు రు. 500/— నుండి రు. 1000/— సంపాదించండి. డాక్టరును సంప్రదించండి.

ఎన్. ఎస్. రావూస్ క్లినిక్,
ప్లాట్ నెం. 471, జూబిలీహిల్సు, హైదరాబాద్-500 034.

SWASTIK

# గృహమేకదా స్వర్గసీమా!

గోలగా ఏడ్చేసేరు. ఆ అరుపులకి సుందరి వురుకులమీదా పరుగులపైనా వచ్చింది. సుబ్బారావు కబంధ హస్తాలనుంచి పిల్లల్ని విడిపించి వళ్లోకి తీసుకుంది. వాతలు తేలిన వీపుల్నీ, వేళ్ళ ముద్రలు పడిన పిల్లల చంపల్నీ చూసి కంట తడి పెట్టింది. ఏడ్చి ఏడ్చి అలసిపోయి నిద్రలో పడ్డారు పిల్లలు. వాళ్ళ దెబ్బలకి బర్నాల్‌రాసి, నీరసంగా వాళ్ళ ప్రక్కనే పడుకుంది సుందరి తనూ.

అప్పుడు ఆ ఇంట్లో గాలి స్తంభించింది. భయంకరమయిన నిశ్శబ్దం. ఉక్కిరి బిక్కిరి చేసినది వాతావరణం. నార్మల్ రొటీన్‌కి భిన్నమయిన గంభీర ప్రకృతి. టెంపరేచర్ రైజయింది.

కాసేపు కాలుగాలిన పిల్లిలాగా అటూ ఇటూ తిరిగి, సుందరి దగ్గరకి వెళ్లాడు సుబ్బారావు.

'వీళ్ళు పిల్లలా రాక్షసులా?! వీళ్లు చేసిన పనికి నేను ఆఫీసరునేత ఇవాళ గట్టిగా ఎన్ని చీవాట్లు తినాలి?' అన్నాడు, తన యాక్షన్‌ని సబ్‌స్టాన్షియేట్ చేసుకుంటాన్కి ప్రయత్నంలా.

'మీరు— ఆ భయం వున్నవాళ్ళు ముందే జాగ్రత్తపడి వుండాలి' అంది కళ్ళు తుడుచుకుంటూ సుందరి పరుషంగా.

'అయితే పొరపాటు నాదేనంటావు? వీళ్ల దేమీ తప్పులేదనేనా నీ అభిప్రాయం?!'

'వాళ్లకేం తెలుసూ? పసిపిల్లలు! ఇన్నేళ్ళు వచ్చిన మనకే ఒకొక్కప్పుడు ఆలోచన వుండదయ్యే.' అని మొహం తిప్పుకుంది నిర్దాక్షిణ్యంగా. సుబ్బారావుకి కోపం పార్ని వచ్చింది. కాస్సేపట్లో అది వుధృతమయింది. ఆ కారణంగా— అలిగి భోజనమయినా చెయ్యకుండా, ఫైళ్ళు పుచ్చుకుని ఆఫీసుకి వచ్చాడు—బుసలు గొట్టుకుంటూ. సుందరి ఏం మాట్లాడనే లేదు.

సుబ్బారావు మనసు అల్లకల్లోలంగా వుంది. కడుపులో ఆకలిగా వుంది. కాంటీను నుంచి, ప్యూను పున్నయ్య చేత, ఎలుగ్గొడ్డు కోసం, కాఫీ పట్టించుకు నొచ్చి త్రాగమని బ్రతిమాలారు అడ్డా, పోలా. గుటుక్కున ఆ వేడి వేడి కాఫీని తాగేసి నిట్టూర్చాడు సుబ్బారావు. చూపులోనే వాళ్లకి థాంక్సు చెప్పాడు.

సాయంత్రం అయిదయేసరికి ఒక నిర్ణ

యానికి వచ్చాడు సుబ్బారావు. పుదయం భోజనం లేనందువలన నీరసంగా వున్నా ఓపిక తెచ్చుకుని, మార్కెట్‌కి వెళ్లి పూలూ, పళ్లూ, స్వీట్సూ తీసుకుని బిక్కు బిక్కుమంటూ ఇల్లు చేరాడు. గుమ్మంలోనే విదురయ్యారు బండి చక్రమూ, సైకిలూ! సుబ్బారావును చూసి, 'నాన్నా! నాన్నా' అంటూ కాళ్లు చుట్టేసారు వాళ్లని ఎత్తుకుని, ముద్దులు కురిపించి స్వీట్సు, పళ్ళు అందించాడు. సుందరికి పూలు ఇచ్చాడు. తన వల్ల పొరపాటు జరిగిన మాట నిజమేననీ, ఇక ఎప్పుడూ రాక్షసుడి లాగా వాళ్ల మీద చెయ్యి చేసుకోననీ, వాగ్దానం చేశాడు. వాతావరణపు వుష్ణోగ్రత నార్మల్‌కి వచ్చేసింది. మనసు ప్రశాంతంగా అయింది. తుఫానూ, అగ్నిపర్వతాలు ప్రేలటాలూ ఆగిపోయాయి. ఎంతో సంతోషంగా ఫీలయాడు సుబ్బారావు. నార్మల్సీ ఈజ్ గ్రేట్!

ఆ మర్నాడూ, తర్వాత వారం రోజుల లోనూ—సుబ్బారావింట్లో కొన్ని వుపద్రవాలు జరిగాయి. సుబ్బారావు కళ్లజోడు టేబులు మీంచి పడిపోయి పగిలింది అతని ఆఫీసు డ్రాయరు తాళంచెవి మాయమయి నాల్గు రోజుల తర్వాత దొరికింది. అతను కొత్తగా మళ్లీ పెన్ను కొనుక్కుంటే అది మాయమయింది. అతని మేజోళ్లు వంటగది అల్మారాలో దాక్కున్నాయి. సుబ్బారావు దైనందిన జీవితాన్ని భంగపరుస్తూ ఎన్నో వుపద్రవాలు జరిగాయి, వాటికి ప్రధాన కారకులు బండిచక్రమూ, సైకిలూ. ఏం జరిగినా అన్నీ నిర్లిప్తంగా స్వీకరించాడు సుబ్బారావు. ఆ అసౌకర్యాలకి ఎడ్జస్టయిపోయాడు. ఆ రోజు సుబ్బారావు ఆఫీసు కెళ్లటానికి బట్టలు తీసి పెట్టుకుని, బాత్‌రూంకి వెళ్లాడు స్నానం చేసి అతను తువ్వాలు చుట్టుకుని వచ్చేసరికి అవి మాయమయ్యాయి. 'ఏంట్రా ? !' అనుకుంటూ బెడ్‌రూంలోకి వెళ్లి చూసేసరికి—అతనిక్కనిపించిందిదీ !—

బూజు బూజుగా వేళ్లాడుతూ కాళ్లనుంచి తల దాకా వచ్చిన 'సుబ్బారావు చొక్కా'ని తగిలించుకుని బండిచక్రమూ, అతని పంచని చీర లాగా చుట్టబెట్టు కొనటానికి అవస్థపడుతూ వున్న సైకిలూ! సుందరిని రహస్యంగా కేకేసి ఆ దృశ్యం చూపించి ముసి ముసిగా నవ్వాడు సుబ్బారావు.

సుందరి తనూ నవ్వి, సుబ్బారావు కేసి చుర చుర చూసింది ఆ వెంటనే.

'కోపమా ? ఎందుకు సుందరీ ?' అన్నాడు సుబ్బారావు, భయం భయంగా.

'ఈ వెధవలు కోతుల్లాగా అవుతున్నారు. రోజు రోజుకీ వీళ్ల అల్లరి శృతిమించుతూంది. అందుకు కారణం మీరే' అంది సుందరి నిశ్చితమయిన ధోరణిలో.

'నేనేం చేశాను దేవీ ? ఇందులో నా తప్పేమిటీ ?'

'వాళ్ళని నెత్తిమీద ఎక్కించుకుని అతిగారం చేశారు ! అదే మీ తప్పు.'

'మరేం చేయనూ ? వాళ్లు పసిపిల్లలు. మన పిల్లలూ వాళ్లకేం తెలుసూ ?'

'నిజమే వాళ్లకి తెలీదు. కమకనే కట్టుదిట్టాల్లో పెంచాలి, భయం భక్తి నేర్పాలి వాళ్లకి పిల్లలు అని నెత్తిమీదకి ఎక్కించుకుంటే ఎలాగా ?' అని ప్రశ్నించింది సుందరి.

'మరి ఏం చేయమని, నాకు దేవిగారి ఆజ్ఞ ?' అని సుబ్బారావు అడిగాడు వినయంగా.

'వాళ్లకి మీరంటే భయం భక్తి వుండాలి. కోపం తెచ్చుకుని గొడ్డుని బాదినట్టుగా బాదటం, లేకపోతే నెత్తిమీద ఎక్కించుకుని వాళ్ళని కోతుల్లాగా తయారు చేయటం, ఇది గృహ యజమానిగా మీకు వుచితమయిన పని గాదు.' అంది సుందరి దృఢంగా.

'చిత్తం' అన్నాడు సుబ్బారావు సరెండరయిపోయి. ఏ ఫైన్ సరెండర్ రియల్లీ !

'చిత్తం గాదు సార్, కావలసింది యాక్షన్' అని సుందరి అనగా, సుబ్బారావు విజృభించాడు.

'ఒరేయ్, రాస్కెల్స్ ఏంట్రా ఆ వెధవ పన్లూ ? భయం భక్తీ లేకుండా, వెధవాయిల్లారా ! వీపులు పగలగొడతాను, చెవులు పొగదీస్తాను' అని గట్టిగా పేలాడు. బిక్కమొహంపెట్టి బండిచక్రం దొర్లుకుంటూ పోగా, సైకిలూ తుర్రుమంది. మెచ్చుకోలుగా—సుందరి అరుణాధరంపై విరిసిన ఆ చిరు దరహాసం వొంక పరిహాసంగా చూసాడు, ఎలుగ్గొడ్డు వురఫ్ సుబ్బారావు. ●

